ప్రజారోగ్య భద్రతే సీఎం లక్ష్యం

- నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు
- 24, 42, 50, 51, 54 వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- ప్రజల నుంచి విశేష స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు


24వ వార్డులో మందులు తీసుకుంటున్న ప్రజలు


50వ వార్డు వైద్య శిబిరంలో ఆరోగ్య వివరాలను తెలియజేస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్


42వ వార్డులో ఐసీడీఎస్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి


51వ వార్డులో మహిళకు కేస్ షీట్‌ను అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

సీతమ్మధార: ప్రజారోగ్య భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 123 సచివాలయం పరిధిలోని ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అనేక వ్యాధులను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలోకి చేర్చి.. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలకు ఉచితంగా ప్రభుత్వం వైద్యం అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం చేస్తోందని చెప్పారు. సుమారు 600 మందికి వైద్యులు పరీక్షలు చేసి, తగు సూచనలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, వైద్యులు మన్మోహన్, సచివాలయ అడ్మిన్ పార్వతి, మండల అధ్యక్షురాలు జి.వి.రమణి, జేసీఎస్ మండల కన్వీనర్ మురళీకృష్ణారెడ్డి, ఎం.సునీల్, దల్లి రామకృష్ణారెడ్డి, పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అందుబాటులో ఉచిత వైద్య సేవలు

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో అంబేడ్కర్ కాలనీ యూపీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. 286 సచివాలయం పరిధికి సంబంధించిన ప్రజలు హాజరయ్యారు. పలు విభాగాల వైద్యులు బీపీ, సుగర్, కంటి వైద్య పరీక్షలు వంటివి నిర్వహించి తగు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మావతి, ఆరోగ్య కేంద్రం డాక్టర్ వెంకటేష్, డైరెక్టర్ పైడి శ్రీను, దిడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, ధర్మావతి, రాణి, శ్యామ్, గణేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన

జీవీఎంసీ 50వ వార్డు 278 సచివాలయం పరిధికి సంబంధించి 49వ వార్డు ఏఎస్సార్ నగర్-2లో యూపీహెచ్‌సీలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ప్రారంభించారు. సుమారు 300 మందికి పైగా ఓపీలో వైద్యులు బీపీ, సుగర్, కంటి, ఎముకలు, దంత పరీక్షలు వంటివి చేసి తగు సూచనలు చేశారు. మెరుగైన వైద్యం కోసం 15 మందికి పైగా ఉన్నత ఆస్పత్రులకు రిఫర్ చేశా రు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసాద్ మాట్లా డుతూ రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ కె.పి.నాయు డు, వార్డు సీనియర్ నాయకులు పొన్నాడ అప్పారావు మాస్టర్, పైడి శ్రీను, పాతపట్నం రామ్మోహన్, రామారావు, వైద్యులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

161 మందికి వైద్య సేవలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు 237 సచివాలయం పరిధికి చెందిన ప్రజలకు సుబ్బలక్ష్మీనగర్ సుబ్బలక్ష్మీ కల్యాణ మండపం వద్ద గల రైల్వే న్యూకాలనీ యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను, అంగన్‌వాడీ పోషకాహార స్టాళ్లను పరిశీలించారు. సుమారు 161 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 21 మందిని కేజీహెచ్, ఇతర ఆరోగ్యశ్రీ సేవలందించే ఆస్పత్రులకు రిఫర్ చేశారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆప్తాల్మజీ, డెంటల్ వైద్యులు తమ సేవలందించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్య, సిబ్బంది, సచివాలయం అడ్మిన్ జేసుదాస్, పార్టీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

205 మందికి వైద్య సేవలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 ఐటీఐ జంక్షన్ తుమ్మడపాలెం సచివాలయానికి సంబంధించి భవాని గార్డెన్స్ యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నేతృత్వంలో జీవీఎంసీ అధికారులు, వైద్యాధికారులు వైద్య పరీక్షలు చేశారు. 54వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి నానాజీ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 205 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ ఎ.ఎల్.శాంతి తెలిపారు. ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్టు నేతృత్వంలో రోగులు, వైద్య సిబ్బందికి భోజన సదుపాయం అందించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, నాయకులు నానాజీ, శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో ఎందరికో లబ్ధి



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మందికి లబ్ధి చేకురుతోంది. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం.

– జి.లక్ష్మి, క్రాంతినగర్

ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలతోపాటు మందులు ఇస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే వేల రూపాయల ఖర్చవుతుంది. ఇక్కడ ఉచితంగా వైద్య సేవలు పొందడం ఎంతో ఆనందంగా ఉంది

– ఎ.మల్లిక, గాంధీనగర్

క్లుప్తంగా

'స్పందన'కు 10 అర్జీలు


అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల దగ్ధంపై కేసు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి తాటిచెట్లపాలెం రామాలయం వీధిలో శనివారం అర్ధరాత్రి పార్క్‌చేసిన మూడు వాహనాల దగ్ధంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రాంతంలో 20 ఏళ్లుగా నివసిస్తున్న నీలాచలం బగాది తన కారును ఎప్పటిలాగే రామాలయం వెనుక భాగంలో పార్క్‌చేశారు. సుమారు రాత్రి ఒంటి గంట సమయంలో పక్కనే ఉన్న చెత్త కుప్పకు నిప్పంటుకోవడంతో రెండు బొలెరో వాహనాలతోపాటు కారుకు మంటలు వ్యాపించి కాలిపోయిన విషయం తెలిసిందే. బాధితుడి బగాది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్


రామాటాకీస్ రోడ్‌లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో దోమల నియంత్రణకు సోమవారం సాయంత్రం 26వ వార్డులో మినీ, 27వ వార్డులో మెగా ఫాగింగ్ నిర్వహించారు. అక్కయ్యపాలెం, పువ్వుల వారి వీధి, రజక కాలనీ, రామాటాకీస్, బెజ్ కృష్ణ హోటల్, ద్వారకానగర్, కళా ఆస్పత్రి, రెడ్డి హాస్పిటల్, అపూర్వ ఆస్పత్రి, పౌర గ్రంథాలయం, తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో వారం రోజులకు మించి నీరు నిల్వ లేకుండా చూడాలని, లేదంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలిగించే దోమలు వృద్ధిచెందుతాయని తెలిపారు. వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది రాంబాబు, శివ పాల్గొన్నారు.

కొండవాలులో చెట్ల కొమ్మల తొలగింపు


ఇందిరానగర్‌లో చెట్టు కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి ఇందిరానగర్-1, జైభారత్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో ఇబ్బందికరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. కార్పొరేటర్ గంకల కవిత వినతి మేరకు జీవీఎంసీ హార్టికల్చర్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న కొమ్మల తొలగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కొండవాలు అభివృద్ధిలో వార్డు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ డీడీ దామోదర్, ఎలక్ట్రికల్ ఏఈ జగదీష్, బీజేపీ జిల్లా ప్లాన్‌మెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాల విద్యార్థులకు పతకాలు

సీతంపేట: సమ్యక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఇటీవల నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో డాక్టర్ బుల్లయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. బీఎస్సీ విద్యార్థిని ఎం.లక్ష్మితారెడ్డి ఉమెన్స్ ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్‌లో, కరాటేలో బంగారు పతకాలు సాధించింది. బీఏ విద్యార్థి బి.ప్రవీణ్‌కుమార్ మెన్ బాక్సింగ్ 57 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని గెలుపొందాడు. ఈ సందర్భంగా సోమవారం వీరిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ యు.గంగాభవాని పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన

మురళీనగర్: విద్యార్థులు తమ ఆరోగ్య రక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీసీసీ జిల్లా సమన్వయకర్త ఎం.ప్రసాద్ అన్నారు. కలెక్టర్ సూచన మేరకు ఎస్‌బీసీసీ ఆధ్వర్యంలో సోమవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, డ్రగ్ అబ్యూజ్, చైల్డ్ ట్రాఫికింగ్ అనే అంశంపై ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడారు. రక్తహీనత సమస్య లేకుండా అవసరమైన ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు డిగ్రీ వరకు తప్పనిసరిగా చదువుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించిననాడు ఉన్నత శిఖరాలను చేరుకోగలరన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో వి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలిగా వసంతలక్ష్మి

అల్లిపురం: ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం విశాఖపట్నం అధ్యక్షురాలిగా న్యాయవాది వై.వసంతలక్ష్మి ఎన్నికయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఆదివారం జరిగిన సంఘం ఎన్నికల ఫలితాలను సంఘం కార్యదర్శి రాయి శ్రీనివాస, ఎన్నికల అధికారి కేపీ దేశాయ్ ప్రకటించారు.

గాయత్రీదేవిగా జగన్మాత



సీతంపేటలో గాయత్రీదేవి అలంకారంలో పార్వతీదేవి | గాయత్రీదేవి అలంకరణలో లలితాదేవి


లలితా పీఠంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సీతంపేట: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో లలితాదేవి గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. మందుగా పంచామృతాభిషేకం, అర్చన, గోపూజ, శతచండీ పారాయణ, మహాలింగార్చన, రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి జపం, అమ్మవారి గర్భాలయంలో శ్రీచక్రనవావరణ, మణిద్వీపంలో సామూహిక కుంకుమార్చనలు జరిపారు. సాయంత్రం లక్ష్మీగణపతి హోమం, చండీ హోమం, లలితా సహస్ర నామ కుంకుమార్చనలు నిర్వహించారు. మంగళవారం అన్నపూర్ణాదేవిగా అమ్మవారు దర్శనమిస్తారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

పార్వతీదేవికి విశేష పూజలు

సీతంపేట పార్వతీశ్వరాలయంలోని పార్వతీదేవి గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికివిశేష పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శివాజీశర్మ పర్యవేక్షణలో లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన, గాయత్రి నామార్చన, చండీ హోమం జరిపారు. అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా లలితాపారాయణ పఠించారు. మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు.

త్రిశక్తి ఆలయంలో పోలమాంబ విగ్రహ ప్రతిష్ట


దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీతంపేట: సీతంపేట కనకమాంబ(త్రిశక్తి) ఆలయంలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోలమాంబ విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.9 లక్షలతో స్టీల్ గ్రిల్స్, బీరువాకు ఆర్థిక సాయం చేసిన ఏపీఈపీడీసీఎల్ సీనియర్ ఖాతా అధికారి సారిపిల్లి పోతురాజు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవిండ్, గ్రానైట్ దాతలు నితీష్ బంగ్, నరేష్ సోమాని దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని దాతల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సారిపిల్లి గంగరాజు, బోర వెంకటరమణ, నమ్మి వెంకట్, ఆవాల వెంకట్, ముప్పల రాజారావు, ముద్దాడ గోవింద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి చర్యలు


వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతుల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, యూసీడీ విభాగానికి 01, ఇంజినీరింగ్ విభాగానికి 01, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జోనల్ సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్న రెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, టౌన్ ప్లానింగ్ టీపీవో అసిస్టెంట్ అపరంజిత, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్‌ఎస్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ చిరంజీవి పాల్గొన్నారు.

పరిశోధనలకు సహకారం


సదస్సులో పాల్గొన్న బీఐఎస్ ప్రతినిధులతో వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సోమవారం నిర్వహించిన ఒక రోజు సదస్సును వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. బీఐఎస్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా తొలి సదస్సును నిర్వహిస్తున్నామని వీసీ తెలిపారు. బీఐఎస్ ఏయూలో చెయిర్ ప్రొఫెసర్‌ని ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు మరింత ఎక్కువగా సేవలను అందిస్తూ, చేరువ చేయడం జరుగుతుందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ వస్తువులు, ఉత్పత్తులను ప్రామాణీకరించడం తదితర అంశాలను వివరించారు. బీఐఎస్ టెక్స్‌టైల్ విభాగం సీనియర్ డైరెక్టర్ జె.కె.గుప్త మాట్లాడుతూ ఆచార్యులు చేసే పరిశోధనలకు సహకారం కల్పిస్తామన్నారు. బీఐఎస్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తో ఆత్మీయ కలయిక




ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కె.కె.రాజు, చొక్కాకుల వెంకటరావు, పీలా వెంకటలక్ష్మి

సీతమ్మధార/సీతంపేట: విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవానికి సోమవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సీఎం జగన్‌ను జేపీసీ చైర్మన్ ప్రొఫెసర్ పి.లజపతిరాయ్ శాలువాతో సత్కరించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జోనల్ మహిళా విభాగం ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, కె.కె.రాజుల సమక్షంలో పలు విషయాలపై సీఎంకు బాణాల వినతిపత్రం అందజేశారు.


అధినేత జగన్‌తో మాట్లాడుతున్న బాణాల శ్రీనివాసరావు


సీఎం జగన్‌ను శాలువాతో సత్కరిస్తున్న ప్రొఫెసర్ లజపతిరాయ్

అనకాపల్లి జిల్లా, పెందుర్తి నియోజకవర్గం పరవాడ ఫార్మాసిటీలో నూతన కంపెనీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు చోడవరం నియోజకవర్గ పరిశీలకుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు


పువ్వుల వీధిలో మహిళలకు పథకాల బ్రోచర్ అందిస్తున్న కె.కె.రాజు, పీలా వెంకటలక్ష్మి

సీతంపేట: సంక్షేమ పథకాల అమలులో లోటుపాట్లు, ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 17 నెలలుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, కె.కె.రాజు తెలిపారు. 26వ వార్డు శాంతిపురం సచివాలయం పరిధిలోని రామకృష్ణానగర్, పువ్వుల వీధి, సరోజని ఆస్పత్రి ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలన్న దృఢ సంకల్పంతో సీఎం జగన్ తనకున్న సమయం మొత్తాన్ని ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకే వెచ్చిస్తున్నారన్నారు. అటువంటి నాయకుడి వెంట ప్రజలంతా ఉండాలన్నారు. పువ్వుల వీధిలో మహిళలు డ్రెయిన్లలో చెత్త తొలగించడం లేదని, వీధిలైట్లు వెలగడం లేదని కె.కె.రాజు దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాంతంలో త్వరలోనే సీసీ డ్రెయిన్లు నిర్మిస్తారని ఆయన తెలిపారు. శానిటేషన్, వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, డైరెక్టర్ రాయుడు శ్రీను, 26వ వార్డు నాయకులు బొడ్డేటి కిరణ్‌కుమార్, రవి బాబు, నవాబ్, శేషు, అమ్మాజీ, ఎం.సునీల్, శ్యామల హరికృష్ణ, రాయ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న పీడీ శోభారాణి

ఎంవీపీ కాలనీ: బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి కోరారు. సోమవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ పేరిట స్వయం సహాయక సంఘాల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా ఏపీని నిలపడంలో స్వయం సహాయక సంఘాలు ప్రత్యేక పాత్ర పోషించాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయకూడదన్నారు. బాల్య వివాహంలో పాల్గొనడం, ప్రోత్సహించడం చట్ట విరుద్ధమన్నారు. అమ్మాయిలను చదువు, ఉద్యోగ అవకాశాల్లో ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పూర్ణిమాదేవి, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.